క్లుప్తంగా

కోడిరామ్మూర్తినాయుడికి ఘన నివాళి



తెలగవీధిలో కోడి రామ్మూర్తినాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు

వీరఘట్టం: ప్రపంచ మల్లయోధుడు కోడిరామ్మూర్తి నాయుడి వర్ధంతిని స్థానిక తెలగవీధి వాసులు ఘనంగా నిర్వహించారు. వీధిలో ఉన్న ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. చరిత్ర ఉన్నంత వరకు మల్లయోధుడు కోడి రామ్మూర్తి నాయుడు ఈ ప్రపంచానికి గుర్తుంటారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దొలూరు సత్యారావు పేర్కొన్నారు. కలియుగ భీముడిగా ఆయన చేసిన సాహసాలను గుర్తుచేసుకున్నారు. అలాగే ఎమ్మార్సీ వద్ద, వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్న కోడి రామ్మూర్తినాయుడు విగ్రహాలకు స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వస్త్రదానం



పేదలకు వస్త్రాలు అందిస్తున్న మోహనరావు, సర్పంచ్, తదితరులు

పాలకొండ రూరల్: సాంప్రదాయ పండగలను అందరితో కలిసి చేసుకోవటం అలవర్చుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు కోట మోహనరావు అన్నారు. భోగి పండగ సందర్భంగా ఆదివారం పనుకువలస గ్రామంలో 50 మందికి నూతన వస్త్రాలు వితరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట మంజు భార్గవి, ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ కోట అజేయ్‌బాబు, జానర్ధనరవు, సతీష్, పి.ముకుందరావు, దాత కుటుంబ సభ్యులు సుధీర్‌కుమార్, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు 'గాలికుంటు' నివారణ టీకాలు



పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

సీతానగరం: స్థానిక సబ్‌డివిజన్ పరిధిలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఆదివారం వేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్టర్ సీహెచ్ దీనకుమార్ ఆధ్వర్యంలో 3 నెలలు దాటిన పశువులకు ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేశారు. సీతానగరం మండలంలో 14,500 పశువులు ఉండగా, ఇప్పటివరకు 6,279 పశువులకు, బలిజిపేట మండలంలోని 29,496 పశువులకు గాను 6,171 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది. వ్యాక్సిన్ వేసిన పశువుల్లో పాలదిగుబడి తగ్గిపోతుందని, పశువులకు జ్వరం వస్తుందన్న అపోహలు వీడాలని, రైతులను అధికారులు కోరుతున్నారు.

ముగ్గుల పోటీలు

పార్వతీపురంటౌన్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని సంగంవలస, ఎన్.ములగ, ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలతో పాటు మ్యూజికల్ చైర్, నృత్య ప్రదర్శన పోటీలు ఆదివారం నిర్వహించారు. బాలికలు, యువతులు, మహిళలంతా ముగ్గుల పోటీలో పాల్గొని, రకరకాల రంగవల్లులు వేసి, తమ ప్రతిభ కనబరిచారు. ఆయా పోటీలతో గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది.



వీరఘట్టం: స్థానిక గౌడవీధిలో ఐదు వేల భోగిపిడకల దండతో ర్యాలీగా వెళ్తున్న బాలికలు



పాలకొండ రూరల్: ఆంజనేయ కాలనీలో..



భామిని: నేరడి-బిలో వేసిన భోగిమంట వద్ద పిల్లలు, యువకుల సందడి



జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో..

ఆనందాల భోగి..

భోగభాగ్యాల భోగి పండగను ఆదివారం అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. యువకులు వేకువజామునే నిద్రలేచి భోగి మంటలు వేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆ మంటల వద్దకు చేరుకుని కేరింతలు కొట్టారు. చిన్నారులు భోగి పిడకలు మంటల్లో వేసి సందడి చేశారు. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. పలువురు తమ ఇళ్లలోని చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వచనాలు అందించారు. ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో..



కురుపాం: జీసీసీ గొదాం వీధిలో..



గరుగుబిల్లి: నాగూరులో..



కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో..

సంప్రదాయాలను గుర్తుచేస్తూ..

గరుగుబిల్లి: సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ..తెలుగువారంతా ఎంతో ఘనంగా జరుపుకునే పండగ సంక్రాంతి. జీవనోపాధి కోసం ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సంక్రాంతి పండగకు సొంతూళ్లు చేరుకుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా పండగ చేసుకుంటారు. హరిదాసుల కీర్తనలు, కొమ్మదాసరి పాటలు, గంగిరెద్దుల నృత్యాలు సన్నాయి వాయిద్యాలతో పల్లెలు సంక్రాంతి శోభను సంతరించుకుంటాయి. కనుమరుగవుతున్న జానపద కళాకారులు ఏడాదిలో సంక్రాంతికి మాత్రమే కనిపిస్తూ తమ కళతో సంప్రదాయాలను నేటి తరానికి గుర్తుచేస్తున్నారు.



ఇంటింటికి తిరుగుతూ సంప్రదాయాలను గుర్తుచేస్తున్న డుడూ బసవన్న



గరుగుబిల్లిలో బుడ్డబుక్కలవాడి సందడి



పెద్దూరులో కొమ్మదాసరి

ఇసుక తిన్నెల్లో సరదాగా..



భామిని వద్ద ఇసుక తిన్నెలపై కబడ్డీ ఆడుతున్న యువకులు

భామిని: సంక్రాంతి పండగ సెలవుల్లో చిన్నారులు స్నేహితులతో సరదాగా గడుపుతున్నారు. నాగావళి నదీతీరంలోని ఇసుక తిన్నెలపై కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడలు ఆడుతూ కాలక్షేపం చేస్తున్నారు. ఆటలు ఆడటం ద్వారా శారీరక వ్యాయామంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉండొచ్చు.

సంక్రాంతి కానుకల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు నిరంతరం శ్రమిస్తున్న గ్రీన్‌అంబాసిడర్లకు భోగి పండగ సందర్భంగా ఆదివారం స్థానిక వర్తక, వైశ్య సంఘం సభ్యులు సర్పంచ్ బి.గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ చేతుల మీదుగా సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. గ్రీన్ అంబాసిడర్ల సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో వర్తక, వైశ్య సంఘాల అధ్యక్షులు విష్ణు, జి.హరిప్రసాద్, సభ్యులు, వైస్ సర్పంచ్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్‌అంబాసిడర్లకు సంక్రాంతి కానుకలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

బ్యాడ్మింటన్ పోటీ విజేత కురుపాం

జియ్యమ్మవలస: మండలంలోని దాసరిపేట గ్రామంలో స్వామీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర జిల్లాల మెన్స్ డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో కురుపాం జట్టు విజేతగా నిలిచింది. కురుపాం, రాజాం జట్ల మధ్య ఫైనల్స్ జరగగా.. కురుపాం విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.10 వేలు, రన్నర్ జట్టుకు రూ.5 వేలు, మూడో స్థానంలో నిలిచిన పార్వతీపురం జట్టుకు రూ.3 వేలు చొప్పున నగదు బహుమతిని వైఎస్సార్‌సీపీ నాయకుడు అంధవరకు కోటేశ్వరరావు చేతులమీదుగా ఆదివారం అందజేశారు. టోర్నీ నిర్వహణకు ఎమ్మెల్యే పుష్పశ్రీ వాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు రూ.10 వేలు, అంధవరకు కోటేశ్వరరావు రూ.8 వేలు విరాళంగా ఇచ్చినట్లు నిర్వాహకులు మక్కువ బలరాం, ఆదినారాయణ తెలిపారు.



విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.కోటేశ్వరరావు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సేవా సంఘం సభ్యులు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

వీరఘట్టం: సంక్రాంతి పండగ సందర్భంగా కత్తులకవిటి గ్రామంలో గ్రామానికి చెందిన సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తుల సహకారంతో కొనుగోలు చేసిన టేకు, మద్ది, వేప, నిద్రగన్నేరు తదితర 200 మొక్కలను గ్రామ రహదారికి ఇరువైపులా నాటి కంచెలు ఏర్పాటు చేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సేవా సమితి సభ్యుడు జంపు ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. అలాగే గ్రామంలో 500 మందికి హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వంజరాపు శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రౌతు రుషీకేశవరావు, గేదెల సుదర్శనరావు, కొత్తవలస మనోజ్‌కుమార్, దనుకొండ ఉదయ్‌కుమార్, మునగపాక శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పెదమరికి గ్రామంలో పార్వతీపురం నియోజకవర్గం పరిధిలోని నిరుపేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా తనవంతు సాయంగా అక్కచెల్లెమ్మల కు ఇస్తున్న ఈ చిరుకానుకను స్వీకరించాలని ఎమ్మె ల్యే కోరారు. అందరికీ పండగ శుభాకాంక్షలు అని, సుఖసంతోషాలతో సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాగాల సోమశేఖర్, సర్పంచ్ జక్కు ప్రవీణ్‌కుమార్, స్థానిక నాయకులు తుమరా డ పకీరునాయుడు, ఎం.భాస్కర్, జన్ని గౌరీశంకర్ పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కళ్యాణం



పాలకొండ రూరల్: సీతారామస్వామి ఆలయంలో వైభవంగా గోదాదేవి కళ్యాణం



పాలకొండ: పూజలందుకుంటున్న గోదాదేవి, రంగనాథస్వామి



గరుగుబిల్లి: స్వామివారిని దర్శించుకొంటున్న భక్తులు

పాలకొండ/పాలకొండ రూరల్: ధనుర్మాస ముంగిపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పాలకొండ పట్టణంలోని సీతారామ స్వామి ఆలయంతో పాటు కోదండరామ స్వామి ఆలయంలో అర్చకులు సీతారాంజీ నేతృత్వంలో అమ్మవారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని అంపిలి, అన్నవరం, తుమరాడతో పాటు పట్టణంలోని సత్యసాయి, మెహర్‌బాబా భక్తులు నగర సంకీర్తన చేపట్టారు.

● గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి, రంగనాథ స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, అర్చనలు అనంతరం స్వామివారికి తిరువీధి నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భోగి పండుగ కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు.